సాక్షి కర్నూలు

గురువారం । 15 । ఆగస్టు । 2024



పంచలోహ విగ్రహం విరాళం

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన జయచంద్ర, పవన్ సోదరులు పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని విరాళంగా అందజేశారు.



పోరాట స్ఫూర్తి.. స్వాతంత్య్ర దీప్తి

స్వాతంత్య్ర ఉద్యమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సమరయోధులు పాల్గొన్నారు. ఆంగ్లేయులను ఎదిరించి వీరోచిత పోరాటం చేసి ప్రాణాలు విడిచారు.

IIలో ▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,924
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:1,20,097

న్యూస్‌రీల్

నదీ స్నానాలకు విరామం



భక్తులు నది వైపు వెళ్లకుండా తీరంలో కాపలా ఉన్న పోలీసులు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద తుంగభద్ర డ్యాం 19వ గేట్ కొట్టుకుపోవడంతో 1.20 లక్షల క్యూసెక్కుల నీరు తుంగభద్ర నదికి వస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులలు నదీ స్నానాలకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భక్తులను పుణ్య స్నానాలకు అనుమతించడం లేదు. ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం మంత్రాలయం పర్యటించి నదీ తీరాన్ని పరిశీలించారు. భక్తుల భద్రత దృష్ట్యా నదీ స్నానాలకు వెళ్లకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో సీఐ రామాంజులు నేతృత్వంలో తీరంలో పోలీసులు పహారా కాస్తున్నారు. ఏపీఎస్‌డీఆర్ బృందం సైతం తీరంలోనే ఉంటోంది. కాగా.. భక్తుల స్నానాల కోసం ప్రత్యేక షవర్లు ఏర్పాట్లు చేశారు.

చిప్పగిరిలో అతి భారీ వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఏడు మండలాల్లో వర్షం కురిసింది. చిప్పగిరిలో అత్యధికంగా 89.2 మి.మీ వర్షపాతం నమోదైంది. హాళగుందలో 22.8, హాలహర్విలో 21.8, మద్దికెరలో 8.6, ఆదోనిలో 7.2, ఓర్వకల్‌లో 6.2, తుగ్గలిలో 4 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 49.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 58 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆగస్టు నెలలో అన్ని మండలాల్లో లోటు వర్షపాతం ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఖరీఫ్ సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 3.14 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి.

ఏప్రిల్ నుంచి అందని వేతనాలు

- డ్వామా, ఆత్మ సిబ్బందికి తప్పని తిప్పలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా), వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ఏప్రిల్ నుంచి వేతనాలు అందలేదు. 010 హెడ్‌తో లింక్ ఉన్న అన్ని శాఖల ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు ఏ నెల వేతనాలు అదే నెల పడుతున్నాయి. 010 లింక్‌లేని వారికి మాత్రం వేతనాలు చెల్లించడంలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఈ విభాగాల్లో పనిచేసే వారికి ప్రత్యేకంగా గ్రాంటు ఇవ్వాల్సి ఉంది. డ్వామా, ఆత్మలో పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు గ్రాంటు ఇస్తుండటంతో వేతనాలకు ఇబ్బంది ఉండేది కాదు. ఎన్నికల కోడ్ రావడంతో ఏప్రిల్ నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు గడిచినప్పటికీ వేతనాలకు గ్రాంటు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్య్రం

కర్నూలు(సెంట్రల్): మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. జిల్లా ప్రజలకు ఆయన స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగాల పునాదులపైనే దేశ నిర్మాణం సాగిందన్నారు. మహాత్ములను స్మరించుకుంటూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉల్లికి పెరుగుతున్న డిమాండ్

- గరిష్ట ధర రూ.3,711

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పండించిన ఉల్లికి డిమాండ్ ఏర్పడింది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇప్పుడిప్పుడే ఉల్లి గడ్డలు అమ్మకానికి వస్తున్నాయి. రోజు రోజుకు ఉల్లి ధరల్లో పెరుగుదల ఉండటంతో వ్యాపారులు పొలాల్లోకే వెళ్లి కొనుగోలు చేస్తుండటం విశేషం. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 12న క్వింటా ఉల్లికి గరిష్టంగా రూ.3,520 ధర లభించింది. బుధవారం 328 క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి రాగా.. కనిష్ట ధర రూ.2919, గరిష్ట ధర రూ.3711... మోడల్ ధర రూ.3611 నమోదైంది. ఉల్లి అత్యధికంగా మహారాష్ట్రలో పండుతుంది. అక్కడ పంట బాగా వస్తే ఈ ప్రభావం దేశ వ్యాప్తంగా ఉంటుంది. అప్పుడు ధరలు పడిపోతాయి. మహారాష్ట్రలో ఉల్లి పంట తగ్గినప్పుడు దేశ వ్యాప్తంగా కొరత ఏర్పడుతుంది. అప్పుడు కర్నూలు ఉల్లికి డిమాండ్ ఏర్పడుతుంది. ఈ ఏడాది మహారాష్ట్రలో కురిసిన అధిక వర్షాల వల్ల ఉల్లి పంట పూర్తిగా దెబ్బతినింది. దీంతో ఉల్లికి కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో పండే ఉల్లిలో 80 శాతం ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పండుతుంది. జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 15,698 హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 9,817 హెక్టార్లలో సాగయింది.

- పెద్దాసుపత్రి నిర్వహణకు డబ్బులు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- మొండికేసిన ఎక్స్‌రే మిషన్‌లు.. ఒక మిషన్‌తో తప్పని తిప్పలు
- సరిపోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లు
- న్యూరో సర్జరీ ఓటీలో పనిచేయని ఏసీలు
- అంతంతమాత్రమే అత్యవసర వైద్యం!
- రూ.38 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిల పెండింగ్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



చికిత్స చేయించుకునేందుకు కర్నూలు పెద్దాసుపత్రికి వచ్చిన ప్రజలు

సర్వజన కష్టాలు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు ఉన్నా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. కర్నూలు పెద్దాసుపత్రికి గతంలో ఏటా రూ.కోటిన్నరకు పైగానే నిర్వహణ నిధులు వచ్చేవి. అయితే 2016లో టీడీపీ ప్రభుత్వం ఈ నిధుల విడుదలను ఆపేసింది. ఆసుపత్రి అభివృద్ధి నిధులు అంతంత మాత్రమే ఉండటంతో నిర్వహణ కష్టసాధ్యమైంది. పరికరాలకు మరమ్మతు చేయించాలన్నా నిధులు రావడం లేదు. కొత్త పరికరాలు కొనేందుకు అధికారులు దిక్కులు చూడాల్సి వస్తోంది. వైద్యాన్ని ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం ఆసుపత్రులకు నిధులు ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. కర్నూలు సర్వజన ఆసుపత్రిని 'సాక్షి' బృందం పరిశీలించగా.. పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

- కర్నూలు పెద్దాసుపత్రికి మూడు వేల మంది రోగులు చికిత్స కోసం వచ్చారు. ఓపీ టికెట్లు ఇచ్చేందుకు వీలుగా రోగుల కోసం 12 కౌంటర్లు ఏర్పాటు చేసినా, రోగులకు సహాయం చేసేందుకు నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచినా సర్వర్ సమస్య కారణంగా ఓపీ తీసుకోవడం ఆలస్యమయ్యింది.
- ఓపీ తీసుకున్న రోగులు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స తీసుకుందామంటే చాలా విభాగాల్లో పెద్ద డాక్టర్లు లేని పరిస్థితి. హెచ్‌వోడీలు వారి గదులకే పరిమితమయ్యారు. ఈ సమయంలో రోగులను చూపించి వైద్య విద్యార్థులకు బోధించేవారే కనిపించలేదు.
- ఎక్స్‌రే మిషన్‌లు చెడిపోవడంతో ఉన్న ఒక్కదానిపైనే రేడియోగ్రాఫర్లు తీస్తూకనిపించారు.
- అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రం వద్ద ఎప్పటిలాగే భారీగా క్యూ కనిపించింది. ఇక్కడ 8 స్కానింగ్ మిషన్లు ఉన్నా రోజుకు 400 దాకా రోగులు వస్తుండటంతో ఆలస్యమవుతోంది. ఈ సమయంలో గర్భిణిల తిప్పలు అంతా ఇంతా కాదు. నిలబడలేక, కూర్చోవడానికి వీలులేక వారు పడే తిప్పలు వర్ణనాతీతం.
- ఆసుపత్రిలోని క్యాజువాలిటీలో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అత్యవసర వైద్యం త్వరగానే అందుతోంది. ఆ తర్వాతే ప్రధాన వైద్యులంతా వెళ్లిపోయి.. డ్యూటీ డాక్టర్లు మాత్రమే ఉంటున్నారు. సాయంత్రం తర్వాత ప్రైవేటు ఆసుపత్రుల్లో సీరియస్ కేసులు తీసుకోరు. అక్కడి కేసులన్నీ ఇక్కడికే వస్తున్నాయి. ఆ సమయంలో క్యాజువాలిటీ కిక్కిరిసిపోతోంది. రోగుల రద్దీ పెరగడంతో వారిని చూసే తీరిక, ఓపిక లేని కొందరు వైద్యులు ఉదయం రావాలని సీరియస్ కాని రోగులకు చెప్పి పంపేస్తున్నారు.
- ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ బకాయిలు ఇప్పటి వరకు రూ.38కోట్లు రావాల్సి ఉంది. ఇందులో కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలైనా ఇప్పటి వరకు ఒక్క రూపాయి రాలేదు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవసరమైన మందులను ఎక్కువగా కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు ఆ మందులే వాడుతున్నారు. అయితే యాంటిబయాటిక్స్ మందులు మాత్రం ఎక్కువగా లేవు.
- గత ప్రభుత్వ చర్యల కారణంగా ఆసుపత్రిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరత లేదు. అయితే నాల్గవ తరగతి ఉద్యోగుల పోస్టులు భర్తీ చేయని కారణంగా ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, స్ట్రెచ్చర్‌బాయ్ పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. దీంతో రోగులను వారి కుటుంబీకులే స్ట్రెచ్చర్‌లు, వీల్‌చైర్లపై తోసుకుని వెళ్తూ కనిపించారు.
- ఆసుపత్రిలోని పలు భవనాల్లో రోగుల సహాయకులు కూర్చోవడానికి సరైన కుర్చీలు లేవు. దీంతో ఎక్కువసేపు నిలబడాల్సి వస్తోంది. ని
- ఆసుపత్రిలోని మాతాశిశు భవనం(ఎంసీహెచ్)లో ఓపీ రద్దీ అధికంగా ఉంటోంది. చిన్నపిల్లల విభాగంలో ఉన్న పీఐసీయు చిన్నగా ఉంది. ఎంసీహెచ్‌లో ఒక లిఫ్ట్ పనిచేయకపోవడంతో మూడంతస్తుల భవనం నుంచి మెట్లు ఎక్కలేక, దిగలేక రోగులు, వారి కుటుంబీకులు ఇబ్బందులు పడుతున్నారు.



వైద్యం కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

108 సేవలకు అంతరాయం



ఈ చిత్రంలో ఆటోలో ఉన్న వ్యక్తి పేరు నూర్‌బాషా. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామానికి చెందిన ఈయన వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో 108 అంబులెన్స్ ఫోన్ చేయగా సమయానికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆటోలో కర్నూలుకు తీసుకొచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున 108 వాహనాలు మొత్తం 57 ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి సేవలకు తరచూ అంతరాయం కలుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయి.

వరండాలోనే వైద్యం



రోగులు వరండాలో ఆరుబయట మంచాలపై చికిత్స పొందుతున్న ఈ దృశ్యం న్యూరోసర్జరీ విభాగంలో కనిపించింది. ఈ వార్డులో నేలపై బండలు విరిగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌లో వారం రోజుల నుంచి ఏసీ పని చేయడం లేదు. ఫలితంగా అక్కడ ఫ్యాన్ ఏర్పాటు చేసుకుని వైద్యులు అతికష్టంమీద ఆపరేషన్ చేస్తున్నారు. గతంలో రోజుకు మూడు నుంచి నాలుగు ఆపరేషన్లు నిర్వహించేవారు. ఇప్పుడు కేవలం ఒకటి మాత్రమే చేయగలుగుతున్నారు. ఏసీ మరమ్మతులకు రూ.50వేలు అవుతుందని అంచనా వేశారు.

రోగులకు 'పరీక్ష'



రక్త శాంపిల్స్ ఇవ్వడానికే బారులు తీరిన రోగులు వీరు. పెద్దాసుపత్రిలో డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఒక్కొక్కరికి అరగంట నుంచి గంటసేపు కేవలం శాంపిల్ ఇవ్వడానికే సమయం సరిపోయింది. శాంపిల్ ఇచ్చిన తర్వాత రిపోర్టు కోసం మధ్యాహ్నం 2 గంటలకు రావాలని సిబ్బంది చెబుతున్నారు. ఇదే సమయంలో తమ ల్యాబ్‌లో పరీక్ష చేసి వెంటనే ఇచ్చేస్తామని ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు రోగులతో మాట్లాడటం కనిపించింది. కొందరిని వారి ల్యాబ్‌లకు కూడా తీసుకెళ్లిపోయారు. ఇలాంటివి జరగకుండా అదనపు శాంపిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని రోగులు కోరుతున్నారు.

సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం



ఆసుపత్రిలో సమస్యలను గుర్తిస్తున్నాం. ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. పరికరాలను మరమ్మతులు చేసే వారు త్వరగా రాకపోవడంతో న్యూరోసర్జరీ, చిన్నపిల్లల విభాగంలో ఇబ్బందులు ఉన్నాయి. ఏఎంసీ, క్యాజువాలిటీ విస్తరణతో కొద్దిగా రోగుల రద్దీ తగ్గింది.

–డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ఆపరేషన్ చేయడం లేదు



మాది ఆదోని మండలం చిన్న గోనెహాల్ గ్రామం. మా నాన్న శంకరన్నకు గుండెలో సమస్య ఉంటే పెద్దాసుపత్రికి తీసుకొచ్చాం. గుండె డాక్టర్లు చూసి ఆపరేషన్ కోసం కార్డియోథొరాసిక్ విభాగానికి పంపించారు. ఇక్కడికి వచ్చి 10 రోజులైంది. ఇప్పటి వరకు ఆపరేషన్ చేయడం లేదు. ఈ రోజు రక్తం తీసుకురమ్మని చెప్పారు. కానీ ఆపరేషన్ ఎప్పుడు చేస్తారో చెప్పడం లేదు.

–కామాక్షి, రోగి సహాయకురాలు

ఆపరేషన్ థియేటర్ సమస్య ఉందంట



మాది డోన్ మండలం కొత్తపల్లి గ్రామం. నా కుమారుడు పృథ్వీతేజకు మెడనొప్పి ఉండి. రెండు చేతులూ లాగుతుండటంతో న్యూరోసర్జరీ విభాగానికి వచ్చాం. 20 రోజుల క్రితం ఇక్కడ అడ్మిట్ చేశారు. ఇప్పటి వరకు ఎప్పుడు ఆపరేషన్ చేస్తారో చెప్పడం లేదు. ఆపరేషన్ థియేటర్‌లో ఏదో సమస్య ఉందని, రోజుకు ఒకరికి మాత్రమే చేస్తారని చెబుతున్నారు.

–లక్ష్మీదేవమ్మ, రోగి తల్లి

తిరుపతి వెళ్లమంటున్నారు



మాది వైఎస్‌ఆర్ జిల్లా ఎర్రగుంట్ల గ్రామం. నాకు మెడనొప్పి కారణంగా కుడి చేయి సచ్చుపడిపోయింది. చికిత్స కోసం ఈ నెల 10న ఆసుపత్రిలోని న్యూరోసర్జరీ విభాగంలో చేరాం. నాలుగు రోజులు డాక్టర్లు బాగానే చూశారు. అన్ని పరీక్షలు చేశారు. కానీ ఆపరేషన్ ఎప్పుడు చేస్తారో చెప్పడం లేదు. మళ్లీ మళ్లీ అడిగితే తిరుపతికి వెళ్లి ఆపరేషన్ చేయించుకోమంటున్నారు.

–మహేశ్వరరెడ్డి, మెడనొప్పి బాధితుడు

జాతీయ సమైక్యత చాటుదాం

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ నాగరాజు, మేయర్ రామయ్య తదితరులు

కర్నూలు (టౌన్): ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటుదామని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కర్నూలులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర మేయర్ బీవై రామయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను చేతపట్టుకుని ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ కొండారెడ్డి బురుజు నుంచి స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వరకు సాగింది. ర్యాలీలో క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. ట్రైనీ కలెక్టర్ సి.హెచ్. కళ్యాణి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కమిషనర్ రామలింగేశ్వర్, సెట్కూర్ సీఈఓ రమణ, పర్యాటక అధికారి విజయ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.నవ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ బి. నవ్య

కర్నూలు(సెంట్రల్): భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబరులో బుధవారం ఉదయం 8.30 గంటలకు జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకొస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు తగిన ప్రణాళికలతో ముందుకెళ్తానని చెప్పారు. అంతకుముందు కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన బి. నవ్యకు డీఆర్వో కె.మధుసూదన్, ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రాలయంలో 18 నుంచి ఆరాధనోత్సవాలు

- శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



నూతన కట్టడాల చిత్రాలను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: సద్గురు రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలు ఈనెల 18 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. బుధవారం శ్రీమఠంలో ఆరాధనోత్సవ ఏర్పాట్లపై స్వామిజీ విలేకరులతో మాట్లాడారు. ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా రాఘవేంద్రుల సప్తరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది సైతం ఉత్సవాలు విజయవంతంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నదీ తీరంలో భక్తుల పుణ్య స్నానాలకు ప్రత్యేక షవర్లు ఉంచామన్నారు. మఠం పీఆర్వో కార్యాలయం, 200 గదులు సముదాయం, అన్నపూర్ణభోజనశాల, నదీతీరంలో రెండు శౌచాలయాలు ఉన్నాయని, వందకుపైగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. హెలిప్యాడ్ గ్రౌండ్, ఆర్టీసీ స్థలం, బృందావనం గార్డెన్, నదీ తీరంలో వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కారిడార్లు, శ్రీమఠం అతిథిగృహాలు, పుర వీధులను విద్యుద్దీపాలతో అలంకరిస్తామన్నారు. శ్రీమఠానికి వచ్చే వివిధ మఠాల పీఠాధిపతుల కోసం గురునివాస్ అనే భవనాన్ని దాతల సహకారంతో నిర్మించామన్నారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు అన్నపూర్ణ భోజనశాల, విజయేంద్ర వసతి గృహం, బృందావన గార్డెన్‌తో సువిశాల మినరల్ వాటర్ ప్లాంట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం నుంచి యోగీంద్ర మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. భవిష్యత్తులో 600 గదులతో భారీ వసతి నిలయం నిర్మాణం చేపడతామని తెలిపారు. శ్రీమఠం శిలామండపం ముఖభాగానికి బంగారు కవచం పనులు పూర్తి కాగా ఆ చిత్రాన్ని, అలాగే పూర్తయిన గురు నివాస్ భవన్ చిత్రాన్ని పీఠాధిపతి ఆవిష్కరించారు. సమావేశంలో మఠం ఏఏవో మాధవశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం
- జెండా ఆవిష్కరించనున్న మంత్రి టీజీ భరత్



కర్నూలులో ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



రూపుదిద్దుకున్న స్టాల్స్

కర్నూలు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కర్నూలులోని పోలీసు పరేడ్ మైదానాన్ని రంగురంగుల జెండాలతో ముస్తాబు చేశారు. వేదికను రంగురంగుల పూలు, మామిడి తోరణాలు, అరటి, టెంకాయ తోరణాలతో అలంకరించారు. ఇరువైపులా షామియానాలు ఏర్పాటు చేసి ఆహూతులు కూర్చునేందుకు కుర్చీలు ఉంచారు. పలు ప్రభుత్వ శాఖలు, పథకాలకు సంబంధించిన శకటాలను సిద్ధం చేశారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేదికపై గురువారం ఉదయం 9:05 గంటలకు పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రత్యేక వాహనంలో పరేడ్‌ను పరిశీలిస్తారు. సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు, పథకాలకు సంబంధించిన స్టాల్స్ సందర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్వాతంత్య్ర దినోత్సవ సందేశాన్ని చదివి వినిపిస్తారు. వేడుకల్లో భాగంగా ఉత్తమ పనితీరు కనబరచిన ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసే అధికారులు, సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

నగరంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రహదారులు, వాణిజ్య సముదాయాలు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఏఆర్‌ఎస్‌ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, కె.సి.శేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ మైదానం కొండారెడ్డిబురుజు వద్ద నుంచి రాజ్‌విహార్ మీదుగా కొత్తబస్టాండ్ వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలలో ...


కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) కార్యాలయాల్లో గురువారం పంద్రాగస్టు వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. లోకాయుక్తలో చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి , హెచ్‌ఆర్‌సీలో ఇన్‌చార్జి సీఈఓ పి.హనుమంతరెడ్డి గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ పతకాలను ఆవిష్కరించి సందేశాలు ఇవ్వనున్నారు.

పోరాట స్ఫూర్తి.. స్వాతంత్య్ర దీప్తి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం

- స్వాతంత్య్ర సమరంలో జిల్లా వీరులది ఎనలేని పాత్ర
- సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ వారిని తాకిన ఉద్యమ జ్వాల
- నేడు స్వాతంత్య్ర దినోత్సవం


గౌడప్ప విగ్రహం


గాడిచర్ల


సర్దార్ నాగప్ప


బియాబానీ

కర్నూలు కల్చరల్: తెల్లదొరల దాస్య శృంఖలాల నుంచి మాతృభూమిని విడిపించేందుకు ఎందరో అవిశ్రాంత పోరాటం చేశారు. జైలు శిక్షలకు వెరవక ఉద్యమమే ఊపిరిగా సాగారు. వందేమాతరం అంటూ ఉప్పెనై కదిలి బ్రిటీష్ పాలకులను గజగజ వణికించారు. తూపాకీ తూటాలను సైతం లెక్క చేయక స్వాతంత్య్రమే లక్ష్యంగా కదం తొక్కారు. వారి త్యాగంతో ఈ దేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. నేడు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్వాతంత్య్ర సమరయోధులపై ప్రత్యేక కథనం..

- మొదటి భారత స్వాతంత్య్ర యుద్ధం (1957) నాటికి పదేళ్ల ముందే, బ్రిటీషు దుష్టపాలనపై తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. తెల్లదొరలను ఎదిరించి ఆయన 1846 జూన్ నెలలో తిరుగుబావుటా ఎగురవేశారు. దుష్టపన్నాగంతో 1847 ఫిబ్రవరిలో ఆయన వీరమరణం పొందారు.
- బ్రిటీష్ వారిపై తెర్నేకల్లు వాసులు 1801లో తిరుగుబాటు చేశారు. రైతులపై విధించిన పన్నుకు నిరసనగా ముత్తుకూరు గౌడప్ప ఆధ్వర్యంలో పెద్ద యుద్ధమే చేశారు. ఈ యుద్ధంలో బ్రిటీష్ సైనికులు.. రైతులను చంపి కుక్కల బావిలో వేసినట్లు చరిత్ర చెబుతోంది.
- ఆంధ్రా తిలక్‌గా పేరొందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు కర్నూలు ప్రాంతానికి చెందిన వారు. నంద్యాలలో విద్యాభ్యాసం చేశారు. తర్వాత ఆయన నంద్యాల కేంద్రంగా కొన్నేళ్లు ఉద్యమాన్ని నడిపారు. స్వరాజ్య ప్రతికను స్థాపించి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు.
- పత్తికొండకు చెందిన నివర్తి వెంకటసుబ్బయ్య నంద్యాలకు వలస వచ్చారు. తాలుకా ఆఫీసులోని ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్య్రోద్యమ బాట పట్టారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్న నివర్తిని, 140 మంది సహచరులను అక్టోబర్ 14, 1940లో ప్రభుత్వం అరెస్ట్ చేసి 8 నెలలు జైలు శిక్ష వేసింది. జైలు నుంచి బయటకు రాగానే మళ్లీ ఉద్యమంలోకి వెళ్లారు. స్వాతంత్య్రం వచ్చాక 1968 నుంచి 78 వరకు ఈయన శాసనమండలి అధ్యక్షునిగా పనిచేశారు.
- స్వాతంత్య్ర ఉద్యమంలో ఆస్తిని విరాళంగా ఇవ్వడమే కాకుండా పోరాటాన్ని జరిపిన ఏకైక మహిళగా పద్మావతమ్మ ఆదర్శంగా నిలిచారు.
- నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన పిలుపు మేరకు బ్రిటీష్ ప్రభుత్వంలో పోలీస్‌గా పనిచేసిన శ్యాముల్ బెనెటిక్ట్ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు.
- నంద్యాలకు ప్రాంతానికిచెందిన దేశాయి కప్పారావు, కోడి నరసింహం, అత్మకూరు నాగభూషణం శెట్టి, ఎర్రబోలు సుబ్బారెడ్డి, యాతం మహానందిరెడ్డి, రాజా శ్రీనివాస్‌లు స్వాతంత్య్ర పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.
- వీరేకాక.. రెడ్డెక్కమ్మ, మొహియుద్దీన్ ఖాద్రి బియాబానీ, ఖాదర్‌బాద్ నర్సింగరావు, డాక్టర్ అబ్దుల్ హక్, కసిరెడ్డి వెంకటరెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి, నాయకంటి శంకర్‌రెడ్డి, పాణ్యం రామచంద్రయ్య, హాల్వి సత్యనారాయణ, టీజీఎల్ తిమ్మయ్య శెట్టి, కొండా వెంకటప్పయ్య, మేడం వెంకయ్య శెట్టి, ముచ్చుకోట వెంకట్రామయ్య, వనం శంకర శర్మ, ధరణీ రామచంద్రరావు, అట్లారెడ్డి లక్ష్మమ్మ, తొమ్మంద్రు వెంటక్రామయ్య, సర్దార్ నాగప్ప, సర్దార్ అమరావతమ్మ, కాదర్‌బాద్ నరసింహారావు, బీవీ సుబ్బారెడ్డి, తారానాథ్, గుర్రం వెంకటరెడ్డి, అంకిరెడ్డి, గోనా, సుభాకర్, ఆత్మకూరి నాగభూషణం, ఆర్‌కే రామ్, దేశాయి కుప్పరావు, గమాగో, పెండేకంటి వెంకటసుబ్బయ్య, మీర్ ఫజ్లీఖాన్, వడ్డే ఓబన్న లాంటి వారు బ్రిటీష్‌వారిపై తమదైన రీతిలో పోరాటం చేసి చరిత్రలో నిలిచారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో కందనవోలుకు ప్రత్యేక స్థానం



స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రముఖ నాయకులతోపాటు సామాన్య జనులు సైతం పాల్గొన్నారు. కర్నూలు పెద్ద మార్కెట్ ఎదురుగా సుభాష్ చంద్రబోస్ హేర్ కటింగ్ సెలూన్ ఉండేది. ఓల్డ్‌సిటీలోనే నాగోజి టైలర్ ఉండే వారు. ఇక్కడ స్వాతంత్య్ర సమరంలో పాల్గొనే వారికి ఫ్రీ సర్వీస్ చేసేవారు. పెద్దమార్కెట్ ఎదురుగా ఉడిపి హోటల్ ఉండేది. దేశభక్తులు, కాంగ్రెస్ నాయకులు సాయంత్రం అక్కడికి చేరుకొని మాట్లాడుకునేవారు.పూల వ్యాపారులు స్వాతంత్య్ర సమరయోధులకు ఉచితంగా దండలు వేసేవారు. ఇలా జన సామాన్యులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు.

– కురాడి చంద్రశేఖర కల్కూర, సాహితీ వేత్త

ఉత్తమ విద్యకు ఉన్నత పురస్కారం

- రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా నిలిచిన ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్
- నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న హెచ్‌ఎం


డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల

కర్నూలు సిటీ: పేద విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌గా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం అవార్డును అందుకోనున్నారు. ఈ పాఠశాలను 2016లో ఏర్పాటు చేయగా.. 2020లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌గా మార్పు చేశారు. ఈ పాఠశాలలో 2020–21 నుంచి పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత శాతం సాధిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది 48 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ 500 మార్కులకుపైగా సాధించారు. ఈ స్కూల్‌కు చెందిన షేక్ హుమేరా ఇక్బాల్ 593 , కె.అనన్యక్రితి 586 మార్కులు సాధించారు. ఈ స్కూల్‌లో చదివిన విద్యార్థుల సరాసరి మార్కులు 546 కావడం విశేషం. అడ్వాన్స్ ఫౌండేషన్ శిక్షణ పొందిన ఉత్తమ ఉపాధ్యాయుల బృందం ఉండడంతో పాటు ప్రత్యేక ప్రణాళికలతో కార్పొరేట్ స్కూళ్లకు మించి ఇక్కడ ఫలితాలు వస్తున్నాయి. వరుసగా మూడోసారి రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ స్కూల్ విభాగంలో ఈ పాఠశాల అవార్డుకు ఎంపికైంది. ఈ విభాగంలో రాయలసీమ జిల్లాల్లో ఎంపికైన ఏకైక స్కూల్ కావడం విశేషం.

అత్యుత్తమ బోధనతోనే అవార్డు



వరుసగా మూడోసారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్కూల్ అవార్డు రావడం, ఆ మూడు అవార్డులను నేనే అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర స్థాయిలో అన్ని యాజమాన్యాలలో వరుసగా మూడోసారి అవార్డు పొందిన ఏకైక స్కూల్ మాదే కావడం ఆనందంగా ఉంది. అత్యుత్తమ బోధనతోనే అవార్డు మా పాఠశాలకు అవార్డు వచ్చింది.

– విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు

తల్లిదండ్రులపై హోంగార్డు దాడి

- ఆస్తి రాసివ్వాలని బెదిరింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు


గాయాలతో సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న హోంగార్డు కుటుంబ సభ్యులు

సి.బెళగల్: పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న విజయ్ ఆస్తికోసం బరితెగించాడు. విచక్షణ మరచి తల్లిదండ్రులు, చెల్లెలుపై దాడికి పాల్పడ్డాడు. కుమారుడి నుంచి తమకు ప్రాణ రక్షణ కల్పించాలని బాధిత తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వివరాలు.. సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కారం మల్లికార్జున, కారం సుజాతలకు కుమారుడు విజయ్, కుమార్తె ఇంద్రాని ఉన్నారు. విజయ్ కర్నూలులో హోంగార్డుగా పనిచేస్తుండగా, ఇంద్రాని ఇంటర్ చదివి ఎంసెట్ కౌన్సెలింగ్ కోసం ఇంటి దగ్గరే ఉంది. మద్యానికి బానిసైన విజయ్.. ఆస్తులు తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించాలని తల్లిదండ్రులతో తరచూ గొడవపడే వాడు. ఈ క్రమంలో పలుమార్లు దాడులు సైతం చేశాడు. గతంలో తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోకపోవడంతో మంగళవారం రాత్రి తన పెద్దనాన్న నాగార్జున, పెద్దమ్మ ప్రభావతితో కలిసి తల్లిదండ్రులైన కారం మల్లికార్జున, కారం సుజాత, చెల్లెలు ఇంద్రాని పై రాళ్లు, కర్రలతో విక్షణ రహితంగా విజయ్ దాడి చేశాడు. గాయాలతోనే బాధితులు సి.బెళగల్ ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు విజయ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

భారీగా గంజాయి స్వాధీనం

కర్నూలు: గంజాయి అక్రమ రవాణా, అమ్మకందారులపై కర్నూలు రెండవ పట్టణ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి కేజీ 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డులోని జలమండలి ఆఫీసు వెనుక కేసీ కెనాల్ ఎడమ గట్టు పక్కన గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం అందడంతో రెండవ పట్టణ సీఐ జి.వి.నాగరాజరావు తన సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచి బుధవారం సాయంత్రం ఇద్దరు విక్రయదారులను అదుపులోకి తీసుకున్నారు. నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామంలోని భూమా నగర్‌లో నివాసముంటున్న పసువుల చంద్ర, కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం సిద్ధనగట్టు గ్రామానికి చెందిన మాదాసు మల్లికార్జునలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి కేజీ 200 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం చింతరేనిపల్లె గ్రామ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న తప్పెట ఓబులేసు కూడా వీరితో కలసి గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు విచారణలో బయటపడిందని, అతని కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంగారు నాగాభరణం విరాళం


బంగారు నాగాభరణాన్ని ఆలయ అధికారులకు అందిస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి ఒడిస్సా రాష్ట్రం రాయఘడ్ జిల్లా గుణుపూరుకు చెందిన జి.గోపాలరావు బుధవారం ఎర్రరాళ్లు పొదిగిన బంగారు నాగాభరణాన్ని విరాళంగా సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు 45 గ్రాముల బంగారు నాగాభరణాన్ని ప్రధానార్చకులు ఎం.ఉమానాగేశ్వరశాస్త్రి, పర్యవేక్షకులు కె.అయ్యన్న, ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునలకు అందజేశారు. దాతకు దేవస్థానం తరపున వేదాశీర్వచనం చేసి స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, రశీదును అందించి సత్కరించారు.

గిరిజనులకు సేవ చేయడం అదృష్టం

- శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి
- మాతృసంస్థకు బదిలీపై వెళ్లడంతో ఘనంగా సన్మానించిన ఉద్యోగులు


పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజనులకు సేవ చేయడం తన అదృష్టమని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి అన్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన మూడేళ్ల క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇటీవల ప్రభుత్వం ఆయనను మాతృసంస్థకు బదిలీ చేయడంతో బుధవారం ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రూ.1 కోటి విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను అందజేసినట్లు తెలిపారు. సున్నిపెంట చెంచుల ఆరోగ్యం కోసం ప్రత్యేక కోవిడ్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్య సాయం అందజేశామన్నారు. జిల్లా కలెక్టర్ల సహకారంతో 1,159 మంది చెంచులకు 2,786 ఎకరాల వ్యవసాయభూములకు, 1,034 మందికి ఇంటి పట్టాలు, 16 కమ్యూనిటీ క్లెయిమ్‌లకు 6,310 ఎకరాల భూములకు అటవీభూహక్కుల చట్టం కింద పట్టాలు ఇప్పించామన్నారు. గిరిజనులకు చేసిన సేవలు ఎంతో తృప్తినిచ్చాయన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ బాధ్యతలను సహాయ ప్రాజెక్ట్ అధికారి ఎ.సురేష్‌కుమార్‌కు అప్పగించారు. కార్యక్రమంలో ఈఈ లతా తిప్పిరెడ్డి, కె.జి నాయక్, బి.సీహెచ్.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థులకు రాజ్‌భవన్ ఆహ్వానం


లహరి


సాయిచరణ్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని లహరికి, వెలుగోడు మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో 593 మార్కులు సాధించిన కొండా సాయిచరణ్‌కు రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. లహరి కేరళలో జరిగిన హాకీ క్రీడా పోటీల్లో సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకుంది. కొండా సాయిచరణ్ వెలుగోడు మోడల్ స్కూల్ చదివి పదో తరగతిలో 600 మార్కులకు గానూ 593 మార్కులు సాధించాడు. దీంతో స్వాతంత్య దినోత్సవ వేడుకల సందర్భంగా విజయవాడ రాజ్ భవన్‌లో గురువారం సాయంత్రం జరిగే ఎట్ హోమ్ రిసెప్షన్‌లో పాల్గొనేందుకు వారికి ఆహ్వానం అందినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఎస్పీజీ హైస్కూల్ హెచ్‌ఎం జీవలత తెలిపారు. కాగా విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉసురు తీసిన అప్పులు


మహేశ్వరరెడ్డి, ప్రశాంతి దంపతులు (ఫైల్)

వెలగోడు: అప్పుల బాధతో రైతు దంపతులు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రైతు ఉదారు మహేశ్వర రెడ్డి(42), ప్రశాంతి(35) దంపతులకు నిఖిల్ కుమార్‌రెడ్డి ఏకైక సంతానం. కుమారుడిని ఉన్నతంగా చదివించి మంచి భవిష్యత్తు అందించాలనే ఆశతో చదువు కోసం, కుటుంబ ఖర్చులకు భారీగా అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం అబ్దుల్లాపురం గ్రామం విడిచి భార్య స్వగ్రామమైన వెలుగోడుకు వచ్చి ఇక్కడే ఉంటున్నారు. అప్పుల భారం పెరిగి బతుకు భారమై దిక్కుతోచని స్థితిలో ఆ దంపతులు మంగళవారం రాత్రి బంధువులకు తాము సొంత పొలంలోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ మెసేజీలు పంపించారు. అయితే అక్కడికి వచ్చి అడ్డుకుంటారేమోనని, కొంత దూరంలోని గ్రామ శివారు ఆర్చి వద్ద నున్న ఇతరుల పొలంలో క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అక్కడ లభించిన సూసైడ్ నోట్‌లో తమకు మిగిలిన మూడు ఎకరాల పొలం ఆన్‌లైన్‌లో ఈ ఏడాది మార్చి 18న నమోదైందని, సరైన ధర లేకపోవడంతో ఆ భూమిని అమ్మలేకపోయానన్న ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం సమాచారం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు పొలం వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ భూపాలుడు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. మృతుడి మామ వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్నూలులో 'కమిటీ కుర్రాళ్లు'


వెంకటేష్ థియేటర్‌లో 'కమిటీ కుర్రాళ్లు' సినిమా బృందం

కర్నూలు కల్చరల్: నగరంలో 'కమిటీ కుర్రాళ్లు' సినిమా బృందం సందడి చేసింది. శ్రీ రాధా దామోదర స్టూడియోస్ బ్యానర్‌పై కొణిదెల నిహారిక నిర్మించిన సినిమా కమిటీ కుర్రాళ్లు ఇటీవల విడుదలైంది. వెంకటేష్ థియేటర్‌కు బుధవారం చిత్ర బృందంతో పాటు నిర్మాత కొణిదెల నిహారిక, దర్శకుడు ఎద్దు వంశీ హాజరయ్యారు. సినిమా ప్రదర్శన జరుగుతుండగానే సినిమా యూనిట్ థియేటర్‌లోకి రావడంతో ప్రేక్షకులు, అభిమానులు కేకలు, ఈలలు వేశారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ మంచి కథ ఉంటే ఏ సినిమానైనా అభిమానులు ఆదరిస్తారని మరోసారి రుజువైందన్నారు. త్వరలో మంచి సినిమాతో ప్రేక్షకులు ముందుకు రాబోతున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో నటీనటులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం


స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసిదేవి, బ్యాంకు ఆర్‌ఎం సుషాంత్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను విద్యలో మరింత ప్రోత్సహించడం లక్ష్యంగా కెనరా బ్యాంకు డాక్టర్ అంబేడ్కర్ విద్యా జ్యోతి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు రీజినల్ మేనేజర్ సుషాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన హౌసింగ్ బోర్డు కెనరా బ్యాంకు బ్రాంచిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవితో కలసి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300 మంది విద్యార్థినులకు రూ.5 వేల ప్రకారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశామన్నారు. సోషల్ రెస్పాన్సిబులిటీ కింద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు కెనరా బ్యాంకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి కింద స్కాలర్‌షిప్‌లు అందజేస్తాం దన్నారు. ఎల్‌డీఎం రామచంద్రరావు, కెనరా బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి..

– బోల్తా పడిన ఆటో.. ఒకరి మృతి


మృతి చెందిన గురుస్వామి

తుగ్గలి: కుక్కను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం రాతన సమీపంలో చోటు చేసుకుంది. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన సుద్దల గురుస్వామి(55) భార్యతో కలిసి బంధువుల వివాహానికి గుత్తి మండలం శ్రీపురం వెళ్లేందుకు పత్తికొండలో ఆటో ఎక్కారు. మార్గమధ్యలో రాతన సమీపంలోని ఆశ్రమ పాఠశాల వద్దకు రాగానే అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో గురుస్వామి మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్, మరో మహిళకు గాయాలయ్యాయి. తుగ్గలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరులో దారుణ హత్య


మృతుడు శ్రీనివాసులు (ఫైల్)

తుగ్గలి(పత్తికొండ): టీడీపీ నేత వాకిటి శ్రీనివాసులు(40) దారుణ హత్యకు గురైన ఘటన పత్తికొండ మండలంలోని హోసూరులో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. హోసూరు గ్రామ సర్పంచ్ శారదమ్మ భర్త శ్రీనివాసులు టీడీపీలో అంచెలంచెలుగా ఎదిగారు. బుధవారం తెల్లవారుజామున ఆయన గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లిన సమయంలో వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్డుతో దాడి చేశారు. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయన్న, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హత్య జరిగిన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య శారదమ్మ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కాగా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మిస్టరీగా హత్య

టీడీపీలో అంచెల ంచెలుగా ఎదుగు తూ వస్తున్న శ్రీనివాసులు హత్య మిస్టరీగా మారింది. గ్రామంలో ఆయనకు ఎవరూ ప్రత్యర్థులు లేరు. ఎవరితోనూ ఎలాంటి గొడవలు లేవు. ఇల్లీగల్ వ్యవహారాలు కూడా లేవని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి వ్యక్తిని ఎవరు, ఎందుకు చంపారో అర్థం కావడలేదనే చర్చ జరుగుతోంది. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతో శ్రీనివాసులు పత్తికొండ సహకార సంఘానికి అధ్యక్షుడు అవుతారనే ప్రచారం నేపథ్యంలో హత్య జరగడం గమనార్హం.

రాజకీయాలతో సంబంధం లేదు: డీఎస్పీ

హత్యకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. మృతుని భార్య శారదమ్మ, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. మృతునికి గ్రామంలో ఎవరితోనూ ఎలాంటి వ్యక్తిగత గొడవలు లేవు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. అయితే అన్ని కోణాల్లో విచారించి త్వరలోనే నిందితులను గుర్తిస్తాం.

మరో 16 మంది సీఐలకు స్థానచలనం

కర్నూలు: పోలీసు శాఖలో అధికారుల బదిలీలు కొన సాగుతున్నాయి. పోలీసు శాఖ నాల్గవ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల్లో పని చేస్తున్న 16 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
గౌతమి	ట్రాఫిక్ పీఎస్, కర్నూలు	డీటీసీ
సుగుణకుమారి	డీటీసీ	వీఆర్
మన్సూరుద్దిన్	వీఆర్	ట్రాఫిక్ పీఎస్, కర్నూలు
తిక్కస్వామి	వీఆర్	కర్నూలుత్రీటౌన్,కర్నూలు(అదనపు పోస్టు)
శ్రీనాథ్‌రెడ్డి	స్పెషల్ బ్రాంచ్-2.	కర్నూలు పీసీఆర్, ఆదోని
పి.టి.కేశవరెడ్డి	కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్	డీఎస్‌బీ-2
అస్రార్‌బాషా	త్రీటౌన్, నంద్యాల	తాలూకా, నంద్యాల
సూర్యమౌళి	తాలూకా, నంద్యాల	త్రీటౌన్, నంద్యాల
వి.కిరణ్‌కుమార్‌రెడ్డి	వీఆర్	పాణ్యం